క్లుప్తంగా

'సూపర్ సిక్స్' అమలు చేయండి



కృష్ణదేవిపేట సచివాలయం సిబ్బందికి వినతి అందిస్తున్న సీపీఐ నాయకులు

గొలుగొండ: కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వస్తే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పిన హామీలు వెంటనే అమలు చేయాలని సీపీఐ నేతలు స్థానిక సచివాలయం అధికారులకు వినతిపత్రం అందించారు. సీనియర్ జిల్లా సీపీఐ నాయకులు మేకా సత్యనారాయణ మాట్లాడుతూ ఇచ్చిన హామీ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అలాగే రైతులకు ఉపయోగపడే చెరువులు అభివృద్ధి చేయకపోవడంతో వ్యవసాయం చేయలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీ కూటమి నాయకులు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సాపిరెడ్డి బాబ్జి, గల్లా సన్యాసిరావు, మేకా భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

30 రోజుల్లోగా సమాచారం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో సోమశేఖర్

కె.కోటపాడు: సమాచార హక్కు చట్టంపై ఉద్యోగులు, పౌరులు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ అన్నారు. కె.కోటపాడు రైతు సేవా కేంద్రంలో సోమవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ ఆదేశాల మేరకు నిర్వహించారు. పౌరులు ప్రభుత్వ శాఖలకు సంబంధించి కోరే సమాచారాన్ని తప్పనిసరిగా 30 రోజుల్లోగా వారికి అందించాలని సూచించారు. ప్రభుత్వశాఖల్లో పూర్తి పారదర్శకత ఉండేందుకు ప్రభుత్వం సమాచార హక్కును కల్పించినట్టు ఏవో తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాలికకు ఎస్ఐ అభినందన



బాలికకు ఫైబర్ బ్యాట్, నగదు అందిస్తున్న ఎస్ఐ తారకేశ్వర్రావు

గొలుగొండ: ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్‌కు ఎంపికైన ప్రవల్లికకు కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వరరావు సోమవారం స్టేషన్‌లో అభినందనలు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడంతో ఆయన ఫైబర్ బ్యాట్, బాల్ బ్యాడ్మింటన్ కిట్‌తో పాటు రాష్ట్ర స్థాయి పోటీ జరిగే ఉమ్మడి చిత్తూరు జిల్లాకు రవాణా ఖర్చులు సైతం అందజేశారు. అండర్-14కు ఎంపికైన ప్రవల్లిక రాష్ట్ర స్థాయిలో మంచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీ రమణ పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు సకాలంలో పరిష్కారం



పిండ్రంగి గ్రామంలో అర్జీలను స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రమేష్

కె.కోటపాడు : రీసర్వే రెవెన్యూ గ్రామసభల్లో వచ్చిన ప్రతీ అర్హత గల అర్జీలకు 15 రోజుల్లోగా పరిష్కారం చూపనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్ అన్నారు. పిండ్రంగి గ్రామంలో సోమవారం రీసర్వే రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 63 మంది అర్జీలను అందించారు. అర్జీలను క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సిబ్బంది పరిశీలించి పరిష్కారాన్ని చూపే చర్యలను తీసుకోనున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ బి.సూరి, మండల సర్వేయర్ రామచంద్రమూర్తి, సర్పంచ్‌లు జాగరపు వెంకట రామలక్ష్మి, వేచలపు దొరబాబు, ఎంపీటీసీ నెక్కల గోపి పాల్గొన్నారు.

ఆగని ఇసుక దందా

- ఉచిత ఇసుక విధానం దుర్వినియోగం
- నదీ పరివాహక ప్రాంతాల్లో యథేచ్ఛగా తవ్వకాలు
- నది ఒడ్డునే ఇసుక నిల్వలు
- దూర ప్రాంతాలకు అక్రమ రవాణా



జి.అగ్రహారం వద్ద ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా



వీరనారాయణంలో పొక్లెయిన్‌తో ఇసుక తవ్వకాలు

మాడుగుల రూరల్ : మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుంది. ఉచిత ఇసుక విధానం అమలు చేసిన తర్వాత ఇసుక అక్రమార్కులు బరితెగించారు. సొంత అవసరాలు పేరుతో మండలంలో నది పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఇసుకను టైరు బండ్ల ద్వారా ఒడ్డుకు చేర్చి, అక్కడ కుప్పలుగా వేస్తున్నారు. అక్కడ నుంచి ట్రాక్టర్లు, లారీల ద్వారా దూర ప్రాంతాలకు ఇసుకను తరలించి విక్రయిస్తున్నారు. ఇసుక ట్రాక్టరు రూ.2500 నుంచి రూ.3వేలకు విక్రయిస్తున్నారు. దూరాన్ని బట్టి కూడా ఇసుక ట్రాక్టరు ధర పెరుగుతుంది. లారీ ఇసుక రూ.15వేల నుంచి 20వేల రూపాయాలకు విక్రయిస్తున్నారు. అధికారులు, పోలీసులు అప్పుడప్పుడు దాడులు నిర్వహించి ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేస్తున్నారు. కానీ రాజకీయ ప్రాబల్యంతో జరిమానా కట్టి తిరిగి వాహనాలు పట్టుకుని వెళ్లిపోతున్నారు. మండలంలో తాచేరు, బొడ్డేరు, శారదానది పరీవాహక ప్రాంతంలో ఇసుక రవాణా జోరుగా సాగుతుంది. సత్యవరం, వీరనారాయణం, జి.అగ్రహారం, వీరవల్లి అగ్రహారం, పోతనపూడి, జంపెన, ఎం.కోటపాడు, గోటివాడ, తదితర గ్రామాలు నదీ పరివాహక గ్రామాల నుంచి ఇసుక తరలిస్తున్నారు. ఇసుక అక్రమ వ్యాపారులు దర్జాగా నదుల్లో కూడా పొక్లెయిన్‌లు ఉపయోగించి ఇసుక తవ్వి రవాణా చేస్తున్నారు. ఇసుక తరలించే వారి దగ్గర ఈ-ట్రాన్సిట్ రిపోర్టు వుండాలని, ప్రతి వాహనానికి జీపీఎస్ ఉండాలని, అలా కాకుండా సొంత అవసరాలకు అని చెప్పి అక్రమంగా తరలించి విక్రయాలు జరిపితే అటువంటి వారిపై పీడీ యాక్టు అమలు చేస్తామని స్థానిక తహసీల్దారు రమాదేవి ప్రకటన కూడా చేశారు. అయినా సరే ఇసుక అక్రమాలు జోరుగా సాగుతున్నాయి. అక్రమంగా ఇసుక తవ్వకాల వల్ల గత రెండు సంవత్సరాల వ్యవధిలో ఐదుగురు నదిలో దిగి మృత్యువాత పడ్డారు. జి.అగ్రహారం నదిలో సుమారు రెండు మాసాల క్రితం ఒక దుక్కిటెద్దుతో పాటు గతంలో ఇద్దరు వ్యక్తులు ఊబిలో పడి మృతి చెందారు. గతంలో వీరవల్లి శారద నదిలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. అలాగే ఇదే చోట గేదె, దుక్కిటెద్దులు నదిలో పడి మృత్యువాత పడ్డాయి. అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు ఇసుక అక్రమ వ్యాపారం చేస్తున్నారని, అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇసుక తవ్వకాల వల్ల వంతెనలు, బ్రిడ్జిలు కూడా కూలిపోతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అలాగే కొన్ని గ్రామాల్లో ఉచిత ఇసుక పేరుతో టైరు బండ్ల మీద తోలుకొని ఇతర గ్రామాలకు తరలించి విక్రయిస్తున్నారు. దూరాన్ని బట్టి ఇసుక టైరు బండి రూ.1000 నుంచి రూ.1500 వరకు విక్రయిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై జిల్లా కలెక్టరు స్పందించి రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మాకవరపాలెం: ఇసుక తవ్వకాల కారణంగా జిరాయితీ భూములకు ముప్పు ఏర్పడుతుందని జంగాలపల్లికి చెందిన ఇటంశెట్టి సత్యనారాయణతో పాటు పలువురు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బి.ఎస్.పేట, జంగాలపల్లిలో సర్పానదిని ఆనుకుని ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఈ తవ్వకాలతో భవిష్యత్తులో తమ జిరాయితీ భూములకు ముప్పు ఉందని సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని రైతులు తెలిపారు. జిరాయితీ భూములకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

డ్వాక్రా సంఘాలకు రూ.61 కోట్ల రుణాలు లక్ష్యం

- స్త్రీనిధి ద్వారా 1400 మందికి రూ.7 కోట్ల రుణాలు
- ఉన్నతి పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలు 215 మందికి రుణాలు
- వెలుగు ఏపీఎం కనకరాజు వెల్లడి



నాతవరం : డ్వాక్రా సంఘాలకు ఈ ఏడాది బ్యాంకు లింకేజీ ద్వారా రూ.61 కోట్లు రుణాలు లక్ష్యంగా పెట్టుకున్నామని వెలుగు ఏపీఎం కనకరాజు అన్నారు. ఆయన సోమవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 1354 డ్వాక్రా సంఘాలకు అర్హతను బట్టి రుణాలు ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఇంతవరకు 395 డ్వాక్రా సంఘాలకు బ్యాంకుల ద్వారా రూ.27కోట్లు రుణాలు ఇచ్చామని, మిగతా సంఘాలకు వచ్చే మార్చి నాటికి శత శాతం రుణాలు ఇస్తామని అన్నారు. రుణాలు తీసుకున్న డ్వాక్రా మహిళలకు చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. తర్వాత స్త్రీనిధి ద్వారా 1400 మందికి ఈ ఏడాది రూ.7 కోట్లు రుణాలు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఒక్కొక్కరికీ రూ.50 వేలు చొప్పున ఇంతవరకు 651 మందికి రుణాలిచ్చామన్నారు. గతంలో స్త్రీనిధి రుణం తీసుకుని సక్రమంగా చెల్లించే గ్రామాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. వీటితో పాటు ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులు ఉన్నతి పథకం ద్వారా 215 మందికి రుణాలు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 165 మందికి రూ.84 లక్షలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ లైను ఏర్పాటుకు అష్టకష్టాలు



ఎగుడుదిగుడుగా ఉన్న రోడ్డులో అతికష్టంతో విద్యుత్ స్తంభాలు మోస్తున్న గిరిజన శ్రామికులు

రోలుగుంట : మండలంలో గల అర్ల గిరిజన పంచాయతీ శివారు కొండ శిఖరాగ్ర గ్రామాలకు విద్యుత్ లైను మంజూరు అయింది. దీంతో ఆ శాఖ అధికారులు విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. కొండ శిఖరాగ్ర గ్రామం అయిన పీత్రుగెడ్డ, చిన లోసింగి, పెదలోసింగి, పెదగరువు తదితర గ్రామాలకు ముందుగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు పనులు సోమవారం ప్రారంభించారు. అయితే ఈ గ్రామాలకు సరైన రహదారి లేక ఎగుడు, దిగుడుగా ఉండడంతో దిగువ నుంచి అతి కష్టం మీద గిరిజన శ్రామికులు ఎగువకు నాలుగు కిలోమీటర్ల మేర స్తంభాలను భుజాలపై మోసుకుంటూ తరలిస్తున్నారు. ఇప్పటికే రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరైనా రోడ్డు పనులు చేయలేదని, వెంటనే గ్రామానికి రోడ్డు సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆయుష్‌తో ఆరోగ్య సంరక్షణ

ఆశా కార్యకర్తలకు శిక్షణ తరగతులు



పెదగోగడ ఆస్పత్రి ఎదుట ఆయుష్‌పై నినాదాలు చేస్తున్న సిబ్బంది

చీడికాడ : హోమియోపతితో దీర్ఘకాలిక వ్యాధులకు చెక్ పెట్టవచ్చునని ఖండివరం హోమియోపతి డాక్టర్ స్వర్ణలత అన్నారు. సోమవారం మండలంలోని పెదగోగాడ పీహెచ్‌సీ పరిధిలో గల ఆశా కార్యకర్తలకు అయుష్ మిషన్‌పై ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ హోమియోపతి మందుల ద్వారా సాధారణ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స చేయవచ్చన్నారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఈ మందులు వ్యాధిని నియంత్రించడంలో పని చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పెదగోగాడ వైద్యాధికారి ఉషా చైతన్య, డాక్టర్ శబ్నం, ఎంపీహెచ్ఓ ప్రసాద్ ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సువర్ణరాజు

దేవరాపల్లి : ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ఇతర కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో సమర్థంగా అమలు చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని దేవరాపల్లి ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు సూచించారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సచివాలయ మహిళ సంరక్షణ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్, స్వచ్ఛ భారత్, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, ఓడీఎఫ్ సర్వే తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించబోమని ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు స్పష్టం చేశారు.

సుపథ ప్రతిభా పరీక్షల్లో ఎ.కొత్తపల్లి విద్యార్థుల ప్రతిభ



ఎ. కొత్తపల్లి హైస్కూల్లో విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం స్వర్ణలత

దేవరాపల్లి : ఎ. కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయి సుపథ ప్రతిభా పరీక్షల్లో విశేష ప్రతిభ కనబరిచారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన సుపథ ప్రతిభా పరీక్షల్లో 9వ తరగతి విద్యార్థిని హేమలత పద్య పోటీల్లో ప్రథమ స్థానం, ఐదో తరగతి విద్యార్థిని శారద ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఆరో తరగతి విద్యార్థిని శ్రావణి ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా సుపథ ప్రతిభా పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను సోమవారం స్థానిక హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వై. స్వర్ణలత, ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, సర్పంచ్ బుల్లి లక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

పరిష్కార వేదికలో 15 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో వి.వి.రమణ

నర్సీపట్నం : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 15 ఫిర్యాదులు వచ్చాయని ఆర్డీవో వి.వి.రమణ తెలిపారు. రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పరిష్కార వేదికలో ఆర్డీవో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఐదుగురు కుటుంబ సభ్యులం పంచుకోవాల్సిన భూమిని మా చిన్నవాడైన జి.రామకృష్ణ రెవెన్యూ అధికారులను లోబర్చుకుని కూతురు, కొడుకుల పేరున ఆన్‌లైన్ చేయించుకున్నాడని, మా సమ్మతి లేకుండా ఆన్‌లైన్ చేసిన భూమిని రద్దు చేయాలని గొలుగొండ మండలం, పాతమల్లంపేటకు చెందిన ముప్పిన రాజారత్నం ఆర్డీవోకు ఫిర్యాదు చేసింది. ఇప్పటికే నాలుగుసార్లు ఫిర్యాదు చేసినా, సమస్య పరిష్కారం కాలేదని బాధితురాలు ఆర్డీవోకు మొరపెట్టుకున్నారు. తహసీల్దార్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఆర్డీవో హామీ ఇచ్చారు. ఇంటి స్థలం ఆక్రమించి తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లికి చెందిన ఎం.రాము అర్జీ పెట్టుకున్నారు. ఆక్రమణకు గురైన తన భూమిని సర్వే చేసి అప్పగించాలని కోరుతూ రమణ అర్జీ పెట్టుకున్నారు. భూ సమస్యలపై ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆర్డీవో మండల స్థాయి అధికారులను ఆదేశించారు.

గ్యాస్ కనెక్షన్ల మార్పుపై ఫిర్యాదు

మాకవరపాలెం: గ్యాస్ కనెక్షన్లు మార్పు చేయడంపై వినియోగాదారులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో ఉన్న హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులకు నర్సీపట్నం సాయిగ్యాస్ ఏజెన్సీ నుంచి సిలిండర్లు అందుతున్నాయి. కొత్తగా మండలంలోని తూటిపాలలో గ్యాస్ ఏజెన్సీ మంజూరైంది. ఈ నేపథ్యంలో కొందరు వినియోగాదారుల కనెక్షన్లను తూటిపాలకు మార్పు చేశారు. దీంతో శనివారం గ్యాస్ బుక్ చేసినా సిలిండర్ బుక్ కాకపోవడంతో వినియోగాదారులు ఇబ్బందులు పడాల్సివచ్చింది. ఈ నేపథ్యంలో తమకు తెలియకుండా కనెక్షన్లు మార్పు చేయడంపై ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సోమవారం మండల కేంద్రానికి చెందిన పి.ఫ్రాన్సిస్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. వినియోగదారులకు తెలియకుండా కనెక్షన్‌లు మార్చడంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే 15 కిలోమీటర్ల లోపు సిలిండర్ డెలివరీ చేస్తే రవాణా చార్జీలు తీసుకోకుడదని నిబంధన ఉన్నా, రూ.30 అదనంగా వసూలు చేస్తున్నట్టు తెలిపారు.

నాగాపురంలో రెవెన్యూ సదస్సు

గొలుగొండ : నాగాపురంలో గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సులు కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రామంలో చాలా కాలంనుండి రెవెన్యూ సమస్యలు అధికంగా ఉండటం వలన గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో 56 మంది రైతులు తమ భూ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. వారిని పరిశీలించి వెంటనే రైతుల సమస్యలు పరిష్కారం చేస్తామని ఆర్ఐ కొండబాబు, సర్వేయిర్ సత్యనారాయణ, వీఆర్వో సత్యనారాయణ తెలిపారు.

రబీ విత్తనాల కోసం నమోదు చేసుకోండి



పెదమదీనలో రైతులకు సూచనలిస్తున్న ఏవో భాస్కరరావు

బుచ్చెయ్యపేట : మండలంలో రైతులు రబీ అపరాల విత్తనాల కోసం రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భాస్కరరావు కోరారు. సోమవారం ఆయన బుచ్చెయ్యపేట, లోపూడి, పెదమదీన తదితర గ్రామాల్లో ఖరీఫ్ వరి పంటలపై ఆశిస్తున్న తెగుళ్లను గుర్తించి రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించారు. ఖరీఫ్ వరి పంట ఆఖరి దశకు చేరిందని వరి పంట కోసిన వెంటనే రైతులు మినుము, పెసర, నువ్వులు, వేరుశెనగ తదితర అపరాల విత్తనాలు సాగు చేసుకోవాలన్నారు. మరో పది రోజుల్లో ఖరీఫ్ వరి కోతలు ప్రారంభమవుతాయన్నారు. ముందుగా అపరాల విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తీసుకుని ఆయా గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి వ్యవసాయశాఖ సిబ్బంది వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

మార్మోగిన శివనామస్మరణ

- భక్తిశ్రద్ధలతో తొలి కార్తీక సోమవారం పూజలు
- శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు



గొలుగొండ : అయ్యప్ప భక్తులకు అన్న సమారాధన



రోలుగుంట : శ్రీ కాశీవిశ్వేశ్వర మృత్యుంజయ ఆలయంలో పూజలు

చోడవరం : పవిత్ర కార్తీకమాసంలో శైవక్షేత్రాల్లో మొదటి సోమవారం పూజలు వాడవాడలా ఘనంగా జరిగాయి. చోడవరం పట్టణంలోని సుప్రసిద్ధ దేవాలయం స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయంలో వేకువ జాము నుంచి భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. స్వామివారికి వెండి నాగాభరణంతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. నాలుగడుగుల ఎత్తు ఉన్న ఈ వెండి నాగాభరణాన్ని మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు సమకూర్చారు. ఆలయ ఉత్సవ కమిటీ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు ప్రసాదం, మజ్జిగ, మంచినీరు ప్యాకెట్లు పంపిణీచేశారు. మూడు నదులు కలిసే ముద్దుర్తి సంగమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నదుల సంగమంలో భక్తులు పవిత్రస్నానాలు ఆచరించారు. జుత్తాడలో స్పటిక లింగం, గవరవరంలో మూడు నందుల శివాలయంతోపాటు గోవాడ శివాలయం మహాశివునికి ఘనంగా పూజలు చేశారు.

గొలుగొండ: ఏఎల్‌పురంలో నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్ప భక్తులకు అన్నసమారాధన జరిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధారమఠం శివాలయంలోనూ ప్రత్యేక పూజలు జరిపారు.

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట, వడ్డాదితో పాటు దిబ్బిడి, సీతయ్యపేట, విజయరామరాజుపేట, తదితర గ్రామాల్లో కార్తీక పూజలు ఘనంగా జరిగాయి. శివాలయాల్లో స్వామికి పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పలువురు మహిళలు ఉదయం నుండి సాయంత్రం వరకు ఉపవాసాలుండి ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో భక్తి భజన బృందాల సభ్యులు రాత్రికి భజనలు చేశారు.

రోలుగుంట: స్థానిక శ్రీ కాశీ విశ్వేశ్వర మృత్యుంజయ ఆలయానికి వేకువ జామునుంచి అధిక సంఖ్యలో భక్తులు సందర్శించి స్వామికి అభిషేకాలు చేశారు. అర్చకుడు పోలాప్రగడ శ్రీనివాస వర్మ పూజలు నిర్వహించారు.భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

నాతవరం: మండలంలో వి.బి.అగ్రహారం గ్రామంలోగల పురాతన రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక తొలి సోమవారం పూజలు ఘనంగా జరిగాయి. ఉత్తర వాహినిగా పేరుగాంచిన చమ్మచింత గ్రామంలో ఉత్తర దిశగా ప్రవహించే తాండవ నదిలో భక్తులు స్నానమాచరించి శివాలయాన్ని సందర్శించారు. జిల్లేడుపూడిలో 50అడుగుల ఎత్తులో నాగసర్పంతో కూడిన శివలింగం, వెదురుపల్లిలో కొండపై వెలసిన శివపార్వతులు, మర్రిపాలెం సిద్ధి పట్నం ఎంబిపట్నం గ్రామాల్లో శివాలయాలను భక్తులు దర్శించుకున్నారు.

మాకవరపాలెం: మండలంలోని పురాతన శివాలయాలుగా పేరొందిన పెద్దమిల్లు జంక్షన్‌లోని స్వయం భూ అయిన వామలింగేశ్వర, పి.పి.అగ్రహారంలోని అమృతేశ్వర, గిడుతూరులోని గంగాధరేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

మాడుగుల/మాడుగుల రూరల్: మండలంలోని శివాలయాల్లో ధ్వజస్తంభాల వద్ద భక్తులు దీపార్చన చేశారు. కె.జె.పురం కాటా ఆవరణలో గల ఉమా భీమలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు అభిషేకాలు, పూజలు, ధ్వజస్తంభాలు వద్ద దీపార్చన నిర్వహించారు. కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గల ఉపాలయం అయిన ఉజ్జయిని మహాకాళేశ్వరుడికి ఘనంగా అభిషేకాలు నిర్వహించారు. పురాతన దేవాలయం అయిన వీరవల్లి అగ్రహారం ఉమా భీమలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నదీ స్నానాలు ఆచరించి స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఎం.కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులకు గొల్లవిల్లి సత్యారావు రాజేశ్వరి దంపతుల ఆర్థిక సహకారంతో ప్రసాద వితరణ జరిగింది. మాడుగుల ఉబ్బలింగేశ్వరాలయం ఉమాహిమలింగేశ్వర, శ్రీ కృష్ణభూపాలేశ్వరాలయాలతో పాటు జంపెన గుప్తలింగేశ్వరాలయంలో అభిషేకాలకు భక్తులు బారులు తీరారు.

తిమిరాంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి పూజలు

దేవరాపల్లి : తిమిరాం ఉమామహేశ్వరస్వామి ఆలయానికి సోమవారం తెల్లవారు జాము నాలుగు గంటల నుంచి భక్తజనం బారులు తీరారు. స్థానిక ఆలయ పురోహితుడు పాకల కామేశ్వరరావు భక్తుల పేరిట అభిషేకాలు, అర్చనలు చేశారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు తిమిరాం ఉమామహేశ్వరీ స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. జెడ్పీటీసీ కర్రి సత్యం స్వామి వారిని దర్శించుకున్నారు.

కె.కోటపాడు : మండలంలో ఎ.కోడూరులో గల భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి ఆలయం ,చౌడువాడలో కాశీవిశ్వేశ్వరాలయం, కె.కోటపాడులో భీమలింగేశ్వరాలయం, లంకవానిపాలెంలో గృహలింగేశ్వర స్వామి ఆలయాల్లో తొలి కార్తీక సోమవారం పూజలు ఘనంగా జరిగాయి.

చీడికాడ : మండలంలో తురువోలు, చీడికాడ, ఖండివరం, బి.సింగవరం, ఎల్.బి.పట్నం, పెదగోగాడ తదితర శివాలయాల్లో తెల్లవారు జాము నుంచి భక్తులు ధ్వజ స్తంభాల వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారు జామున నదీ స్నానాలు ఆచరించి దీపాలను విడిచారు.



నాతవరం : వి.బి.అగ్రహారంలో పూజలు



బుచ్చెయ్యపేట : వడ్డాది రామలింగేశ్వరస్వామి ఆలయంలో



దేవరాపల్లి : తిమిరాంలో ఉమామహేశ్వర స్వామి సన్నిధిలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



మాకవరపాలెం : వామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు



నాతవరం : పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారంలో ధ్వజస్తంభం వద్ద దీపార్చన



కె.కోటపాడు : భీమలింగేశ్వరాలయంలో



చోడవరం : స్వయంభూ విఘ్నేశ్వరఆలయంలో..



మాడుగుల : ఉమా మహేశ్వరాలయంలో అభిషేకాలు